# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**AUGUST - 2018**

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లక్కీ గూటం |
| | | రోసీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

సత్యవాక్కు
THE WORD OF TRUTH
P.O. Box - 80, Kakinada, A.P. 533 001.
Ph : 0884-2363722 Cell : 98489 98547
Editor
JOSHUA GOOTAM
Pleading for Restoration of First Century Christianity
సంపుటి - 40 ఆగష్టు - 2018 సంచిక -1

# మారుమనస్సు అనగా యేమిటి ?

## ( What is Repentance ? )

మారుమనస్సును గూర్చి దేవుని గ్రంథము ఎక్కువ బోధించుచున్నది. దేవుని ప్రజలు మారు మనస్సు కలిగి జీవించవలెనని దేవుడు కోరుచున్నారు. "భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలిపడును. వారు మన దేవుని వైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును" అని ప్రవక్తయైన యెషయా పలికెను (యెషయా 55:7). "ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా – మీ విగ్రహములను విడిచిపెట్టి మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడి" (యెహెజ్కేలు 14:6). బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడని ప్రకటించెను (మత్తయి 3:2). మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు అని లూకా 13:3లో యేసు బోధించెను. మీరు మారుమనస్సు

పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి యని పేతురు బోధించెను (అపో.కా. 2:38). ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించు చున్నాడు అని అపో.కా. 17:30లో పౌలు బోధించెను.

మారుమనస్సును గూర్చి బైబిలు బోధించుచున్న కొన్ని వచనములను మాత్రమే ఇంతవరకు మనము చూచాము. గనుక మారుమనస్సు అత్యవసరమను సంగతిని ఎవరు కాదనలేరు. అయితే నీవు మారు మనస్సు నొందితివా?

అయితే మారుమనస్సు అనగా యేమిటి? మనుష్యులు మారుమనస్సు పొందుట యెట్లు? అనే ప్రశ్నలు మనకు ఇప్పుడు రావచ్చును. మారు మనస్సు అనగా యేమిటో, దానిని నీవెట్లు పొందవలెనో తెలియజెప్పుటకు ఈరోజు మన సమయమును విని యోగించుదము.

నీనెవెవారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి యని మత్తయి 12:41లో యేసుబోధించెను. గనుక నీనెవె వారేమి చేసిరో మనము తెలిసికొనగల్గిన యెడల మారుమనస్సు అనగా యేమిటో గ్రహించుకొన గలము. అందువలన ఒకసారి యోనా గ్రంథమును చూచుకొందము. “నీనెవె పట్టణస్థుల దోషము నా దృష్టికి ఘోరమాయెను గనుక నీవు లేచి నీనెవె మహాపట్టణమునకు పోయి దానికి దుర్గతి కలుగునని ప్రకటింపుమని” యెహోవా దేవుడు యోనాకు సెలవిచ్చెను. యోనా ఆ పట్టణములో సంచరించుచు నీనెవె పట్టణము నాశన మగునని ప్రకటన చేయగా, ఆ పట్టణ పువారు అందరు దేవుని యందు విశ్వాసముంచి, ఉపవాస దినము

చాటించి రాజుతో సహా అందరును గోనెపట్ట కట్టుకొని పశ్చాత్తాపమును వెల్లబుచ్చిరి. మరియు నీనెవె రాజు, "మనుష్యులందరు తమ దుర్మార్గము లను విడిచి తాము చేయు బలాత్కార మును మానివేయవలెనని... జనులు మన:పూర్వకముగా దేవుని వేడుకొన వలెనని" పట్టణములో చాటింప ప్రకటన చేయించెను. ఈ నీనెవె వారు తమ చెడునడతలను మానుకొనగా వారు చేయుచున్న క్రియలను దేవుడు చూచి పశ్చాత్తాప్తుడై వారికి చేయుదు నని తాను మాటయిచ్చిన కీడుచేయక మానెను.

నీనెవెవారు అట్లు చేయగా వారు మారుమనస్సు పొందిరియని యేసు చెప్పెను. గనుక చెడునడతల నుండి మానుకొనుట మారుమనస్సు అని మనము గ్రహించుకొనగలము. మారు మనస్సు క్రియలలో లేక ప్రవర్తనలో బుజువగును గాని కేవలము మాటలలో కాదు. భక్తిహీనులు తమ మార్గములను విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను అని ప్రవక్తయైన యెషయా బోధించుటలో వారు మారుమనస్సు పొందవలెనని బోధించెను. వారు మారుమనస్సు పొందని యెడల దేవుని క్షమాపణ వారికి లభించదు అని అతడు బోధించెను.

మారుమనస్సు అనగా యేమిటో భక్తుడైన సమూయేలు ఇశ్రాయేలీయు లకు ఇట్లు బోధించెను : "మీ పూర్ణ హృదయముతో యెహోవా యొద్దకు మీరు మళ్ళుకొనుడి; అన్యదేవతలను అష్తారోతు దేవతలను మీ మధ్య నుండి తీసివేసి పట్టుదల కలిగి యెహోవా తట్టు మీ హృదయములను త్రిప్పి ఆయనను సేవించుడి... అంతట ఇశ్రాయేలీయులు బయలు దేవతలను, అష్తారోతు దేవతలను తీసివేసి యెహోవాను మాత్రమే సేవించిరి" (1 సమూ 7:34).

మారుమనస్సు అనగా అన్య దేవతలనుండి, విగ్రహముల నుండి మనస్సు త్రిప్పికొని నిజమైన యెహోవా దేవుని సేవించుట యని భక్తుడైన సమూయేలు మనకు ఇక్కడ బోధించు చున్నాడు. ప్రవక్తయైన యెహెజ్కేలు కూడ అట్లే, మీ విగ్రహములను, మీ హేయకృత్యములను మానుకొని మనస్సు త్రిప్పుకొనుడి యని బోధించెను.

ఒక్కోసారి కొందరు సగము మట్టుకే మారుమనస్సు పొందుదురు. అంటే వారు కొన్ని దురలవాట్లను, దుష్క్రియలను మానుకొని మరికొన్నిటిని కొనసాగించుచుందురు. అయితే అట్టి మారుమనస్సు నులివెచ్చని స్థితిని సూచించు చున్నది. ఆత్మీయ విషయములో నులివెచ్చగా నుండువారి యెడల దేవుని చిత్తమేమై యున్నదో మనమెరుగుదుము. ఆయన యిట్లను చున్నాడు : "నీ క్రియలను నేనెరుగుదును, నీవు చల్లగానైనను, వెచ్చగానైనను లేవు; నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక నులివెచ్చగా ఉన్నావు. గనుక నేను నిన్ను నా నోట నుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను" (ప్రకటన 3:15,16). సగము మారు మనస్సు పొందిన వ్యక్తులు దేవునికి హేయులు.

సంపూర్ణ మారుమనస్సుకు ఉదాహరణగా తప్పిపోయిన కుమారుడు మనకు కనబడుచున్నాడు. తన తండ్రి యొద్దనుండి ఆస్తిలో తనకు వచ్చు భాగమును అతడు తీసికొని దూర దేశమునకు పోయి తన ఆస్తిని దుర్వ్యాపారము వలన పాడుచేసెను. అతడు యిబ్బంది పడసాగి పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను గాని వానికేమియు దొరుకలేదు. అయితే బుద్ధివచ్చినప్పుడు అతడు లేచి తన తండ్రి యొద్దకు వెళ్ళి, తండ్రీ, నీయెదుటను దేవుని యెదుటను నేను పాపము చేసితిని; నీ కుమారుడ గుటకు ఇక మీదట నేను యోగ్యుడను

కాను; నన్ను నీ కూలివారిలో ఒకనిగా పెట్టుకొనుమని చెప్పెను.

ఈ తప్పిపోయిన కుమారుడు పాపము వలన దేవుని నుండి తొలగి పోయినట్లు గ్రహించుకొనెను. అతడు తన పాపపు స్థితిని విసర్జించుటకు నిశ్చయించుకొనెను. తన తండ్రి యొద్దకు వచ్చి తన అపరాధములను ఒప్పుకొనెను. సన్మార్గమున నడుచు కొనుటకు సంసిద్ధుడై యున్నట్లు నిరూపించుకొనెను. అందు వలన అతని తండ్రి అతనిని కూలివానిలో ఒకనిగా గాక కుమారుడుగా సంతోషముతో అంగీకరించెను. ఇది సంపూర్ణ మారుమనస్సు. ఒకడు తన దుష్క్రియలను, దుష్టతలంపులను మానివేసి దేవుని వైపు తిరుగుట సంపూర్ణ మారుమనస్సు.

మారుమనస్సు గూర్చి యేసు మరియొక ఉదాహరణను చెప్పెను. 'ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటి వాని యొద్దకు వచ్చి – కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా, వాడు– పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొనిపోయెను. అతడు రెండవ వాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు – అయ్యా, పోదుననెను గాని పోలేదు' (మత్తయి 21:28–30). దేవుని చిత్తమునకు వ్యతిరేకముగా నడుచుకొను వారు తమ మనస్సును మార్చుకొని దేవుని పనిచేయుట మారుమనస్సు అని దీనివలన మనము గ్రహించు కొనగలము.

మానవులు తమ పాపములను విసర్జించి దేవుని తట్టు తిరిగిన యెడల పరలోకమందు గొప్ప సంతోషము కలుగును. మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారమనస్సు పొందు ఒక్క పాపి

విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును అని లూకా 15:7లో యేసు బోధించెను. మీరు మారుమనస్సు బొందని యెడల మీరందరు నశింతురు అని ఆయన చెప్పెను. అయితే మనలో యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారు మనస్సు పొంద వలెనని కోరుచు మన ప్రభువు మన యెడల దీర్ఘశాంతము కలిగి యున్నారు (2 పేతురు 3:9).

దేవుని అనుగ్రహము మారు మనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించు చున్నదని యెరుగక ఆయన అనుగ్రహైశ్వర్యమును, సహనమును, దీర్ఘశాంతమును నీవు తృణీకరించు చున్నావా? అయితే దేవుని ఉగ్రత నీ మీదికి తప్పక వచ్చును (రోమా 2:4-6). ఆయన ఉగ్రత నుండి రక్షింప బడవలెనంటే యేసు నందు విశ్వాసముంచుము, మారుమనస్సు బొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. మార్పు నొందిన నీ జీవితమును బట్టి అనేకులను క్రీస్తులోనికి మార్చుము.


మీరు సత్యవాక్కు సాలు చందాకట్టారా? లేని యెడల ఇప్పుడే రూ.50/-లు ఎమ్.ఒ. చేసి మీ సభ్యత్వమును కొనసాగించు కొనండి.

సత్యవాణి

7-9-35, సాంబమూర్తి వీధి, కాకినాడ - 533 004.

# మార్పు జెందుట

## ( Conversion )

(గత సంచిక తరువాయి భాగం)

**5. క్రొత్త నిబంధన మార్పుల మాదిరి ఎక్కడ యున్నది ?**

అపొస్తులుల కార్యములు అను పుస్తకము ఒక్కటి మాత్రమే క్రొత్త నిబంధనలో మార్పుజెందిన వారి మాదిరిలను కలిగియున్నది. ఒకడు క్రైస్తవుడగుటకు చేయవలసిన దేమిటో తెలిసికొనవలెనన్న అతడు అపొస్తులుల కార్యములు అను పుస్తకమును చదువ వలెను. అపొస్తులులు ఏమి బోధించిరో, మనుష్యులు దేవుని వైపు ఎట్లు తిరిగిరో నేర్చుకొనవలెను. అందున్న మాదిరులను అవలంభించుట చాల సూక్ష్మమే; ఏలయనగా పరిశుద్ధాత్మావేశము గల వారి బోధనలను బట్టి అవి జరిగెను. అపొస్తులుల కార్యములు అనుపుస్తకము నుండి ఇప్పుడు కొన్ని మాదిరులను గమనించుము :

**1. పెంతెకొస్తునాడు మార్పు నొందిన వారు :**

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు దినమున పేతురు గొప్ప జనసమూహమునకు క్రీస్తును గూర్చి బోధించెను. అప్పుడు మూడు వేల మంది క్రీస్తు తట్టు తిరిగిరి. సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2).

"పరిశుద్ధాత్ముడు ఈ ప్రజలను మార్చెనా?" అని కొందరు అడుగుదురు. ఆయనే మార్చెనని అందరు అంగీకరింతురు. అయితే ఆయన దాని నెట్లు జరిగించెను? పేతురు చేసిన ప్రసంగము ద్వారా జరిగించెనని జవాబు చెప్పవచ్చును. అపొస్తులుని ద్వారా ఆత్మ ప్రకటించిన దేవుని వాక్యము వారిని క్రైస్తవులగుటకు నడిపించెను. అక్కడ కూడియున్న జన సమూహమునకు పేతురు సిలువ

వేయబడినట్టియు తిరిగి లేచినట్టియు ప్రభువును గూర్చిన సువార్తమానము బోధించెను. ఆ బోధవలన వారు హృదయములలో నొచ్చుకొనిరి. దేవుని కుమారుని సిలువ వేయుటలో వారు అపరాధులని వారిపై నేరస్థాపన జరిగెను (అపో.కా. 2:36,37). పేతురు ప్రకటించిన సత్యమునందలి విశ్వాసము వలన సహోదరులారా మేమేమి చేతుము? అని వారడిగిరి. పరిశుద్ధాత్మని నడిపింపు వలన పేతురు "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని జవాబిచ్చెను (అపో.కా. 2:38).

బాప్తిస్మము పొందకముందే పాప క్షమాపణ జరుగునని కొందరు తలంచుటచేత "పాపక్షమాపణ నిమిత్తము" అను మాటలు వారికి అర్ధము కావు. ఎవని పాపములైనను క్షమించబడవలెనంటే బాప్తిస్మము అవుసరమని లేఖనములు విపులీ కరించు చున్నవి. మత్తయి 26:28లో అది వివరించబడెను : "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింప బడుచున్న నిబంధన రక్తము" అని క్రీస్తు పలికెను.

పాపక్షమాపణ నిమిత్తము, అనగా పాపములు క్షమించబడుట కొరకు క్రీస్తు రక్తమును ఎట్లు చిందించెనో అట్లే పాపక్షమాపణ నిమిత్తము (అనగా పాపములు క్షమించబడుట కొరకు) బాప్తిస్మము పొందవలెనని పేతురు బోధించెను (అపో.కా. 3:19 లో కూడ మార్పునొందుటకవుసరమైన మెట్లు వ్రాయబడియున్నవి).

గనుక క్రీస్తు నందు విశ్వాస ముంచుట వలన ప్రజలు హృదయములో ప్రభువు తట్టు తిరిగిరి. మారుమనస్సు నొందుట వలన వారి ప్రవర్తనలో వారు ఆయన వైపు తిరిగిరి,

బాప్తిస్మము పొందుట వలన సంబంధములో వారాయన తట్టు తిరిగిరి.

**2. సమరయులు మార్పుజెందుట :**

సమరయలో మార్పుజెందిన ప్రజలు సువార్తను వినిరి, విశ్వసించిరి, బాప్తిస్మము పొందిరి. వారు మార్పు జెందిన విధానమును లూకా ఇట్లు వ్రాసెను: "అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణము వరకును వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను. జన సమూహములు విని ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటల యందు ఏక మనస్సుతో లక్ష్యముంచిరి. అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి" (అపో.కా. 8:5,6,13).

**3. నపుంసకుని మార్పు :**

ఐతియోపీయకు జెందిన ఈ అధికారి సువార్తను వినెను, విశ్వసించెను, యేసు దేవుని కుమారుడని తన విశ్వాసమును ఒప్పుకొనెను. బాప్తిస్మము పొందెను. అతడు మార్పుజెందిన సందర్భములో చివర భాగము ఇట్లున్నది : "అందుకు ఫిలిప్పు నోరు తెరచి ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్ళు నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి, రధము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను" (అపో.కా. 8:35-39).

ఫిలిప్పు బోధించగా యేసు నందు విశ్వాసముంచవలెనని ఈ నపుంసకుడు గ్రహించుకొనెను. అది మార్పుజెందుటలో మొదటి మెట్టు. ఈ విశ్వాసమును బట్టియే మార్పుజెందుటలో ఆఖరి మెట్టయిన బాప్తిస్మమును అతడు కోరెను.

### 4. తార్సువాడైన సౌలు మార్పు :

అపొస్తులుల కార్యములలో వ్రాయబడిన ఆశ్చర్యకరమైన మార్పులలో తార్సువాడయిన సౌలు మార్పుజెందుట ఒకటి (అపొ.కా. 9:1-23; 22:16; 26:9-18). సౌలు దమస్కునకు పోవు మార్గమున ప్రయాణించు చుండగా యేసు అతనికి కనబడి ఆయనే క్రీస్తని సౌలును నమ్మించెను. అతడు పట్టణములోనికి వెళ్ళవలెనని అతడేమి చేయవలెనో అది అతనికి అక్కడ తెలియజేయబడునని యేసు అతనితో చెప్పెను. నీవు హింసించుచున్న యేసును నేనే అని యేసు అతనికి తెలియజేయగా మార్గములోనే యేసే రక్షకుడని సౌలుకు దృఢనమ్మకము కలిగెను (ఇది మార్పు జెందుటలో మొదటి మెట్టు). దీని తరువాత అతడు దమస్కులో చింతాక్రాంతుడై మూడు దినములు ప్రార్థనలో గడిపెను. దీనివలన అతడు మారు మనస్సు పొందినట్లు వ్యక్తపరచెను. అతడిప్పుడు ఆఖరిమెట్టును అనగా బాప్తిస్మమును పొందవలెను. అతడేమి చేయవలెనో తెలియజేయుటకు అననీయ సౌలునొద్దకు పంపబడెను. అననీయ ఇట్లనెను : "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపొ.కా.22:16).

ప్రార్థన ఒక్కటి మాత్రమే యెవరినైన రక్షించగల్గిన యెడల అది సౌలును ఎందుకు రక్షించలేకపోయెను? జవాబేమంటే : పాపక్షమాపణ నొందుటకు పాపియైనవాడు ప్రార్థన చేయవలెనని ఎన్నడు ఆజ్ఞాపింపబడనే లేదు. గనుక

బాప్తిస్మమునకు బదులు ప్రార్థన పనికి రాదు.

కొందరనుకొనుచున్న రీతిగా అననీయను కలసికొనక ముందే సౌలు రక్షించబడిన యెడల, అతని పాపములు క్షమించబడక ముందే అతడు రక్షించబడెనన్నమాట! అతడు అననీయను కలసికొనకముందు అతని పాపములు క్షమించబడలేదు. సౌలు అక్కడ రక్షించబడిన యెడల అది అతనికి తెలియదు; దానిని గూర్చి యేసుకు కూడ తెలియదు, అంతే కాదు ఆ సంగతి అననీయకు కూడ తెలియదు. అతడు నిజంగా రక్షించబడితే, మార్పు జెందిన వారందరిలోను దౌర్భాగ్యుడుగా అగుపడెను. ఏలయనగా దమస్కు రోడ్డు మీద జరిగిన సంఘటన నుండి అతడు అననీయను కలసికొను వరకు యున్న మూడు రోజులలో అతడు అన్న పానములేమియు పుచ్చుకొనలేదు. బాప్తిస్మము ద్వారా పాపములు కడుగవేయబడునని బైబిలు బోధించు చున్నందున సౌలు తన పాపములు కడిగి వేయబడక ముందే రక్షింప బడలేదు (అపో.కా. 22:16).

**5. కొర్నేలి మార్పు :**

అన్యజనులలో నుండి క్రైస్తవుడుగా మారిన మొదటివాడు కొర్నేలి (అపో.కా. 10;11:1-18). అతడు తన యింటి వారందరితో కూడ దేవుని యందు భయభక్తులు గలవాడైయుండి ప్రజలకు బహుధర్మము చేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్థన చేయువాడని వర్ణించబడెను. అయితే కొర్నేలి వంటివాడు మార్పుజెందవలసిన అవసరమేమున్నది? యని కొందరు అడుగుదురు. దానికి జవాబేమంటే, అతడింకను పాపియైయుండెను; క్రీస్తు తట్టు తిరుగుటకు అవుసరమైన మూడు ప్రాథమిక మార్పులు అతడు అనుభవించలేదు. కొర్నేలీకి ఒక దూత కనబడి నీవు పేతురును పిలిపించుము; నీవును నీ యింటి వారందరను ఏ మాటల వలన రక్షణ పొందుదురో ఆ మాటలు అతడు నీతో చెప్పునని

తెలియజేసెను (అపో.కా. 11:14). కొర్నేలీ అపొస్తలులు బోధించగా మార్పుజెందిన వారందరు ఒకేరీతిగా క్రీస్తునందు విశ్వసించి, క్రీస్తే ప్రభువని ఒప్పుకొని ప్రార్థన చేయుచు మూడు దినములు గడిపిన తరువాత అననీయ అతనిని కలసికొనెను. దమస్కు రోడ్డు మీదనే సౌలు రక్షించబడలేదు. రక్షించ బడలేదని యిది నిరూపించుచున్నది. యేసేక్రీస్తని పేతురు బోధించిన తరువాత అతడును, అతని యింటి వారును యేసుక్రీస్తు నామమందు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను (అపో.కా. 10:48).

**6. లూదియ మార్పు :**

అట్లే లూదియ, ఆమె యింటి వారు పౌలు ద్వారా సువార్త వినిరి, విశ్వసించిరి, బాప్తిస్మము పొందిరి (అపో.కా. 16:14,15).

**7. చెరసాల అధిపతి మార్పు :**

అలాగే ఫిలిప్పీయి చెరసాల అధిపతియు అతని యింటివారును వాక్యము వినిరి, విశ్వసించిరి, బాప్తిస్మము పొందిరి. రాత్రివేళ మహా భూకంపము కలిగిన తరువాత "అతడు దీపము తెమ్మని చెప్పి లోపలికి వచ్చి, వణుకుచు పౌలుకును సీలకును సాగిలపడి వారిని వెలుపలికి తీసుకొని వచ్చి, అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెనననెను. అందుకు వారు ప్రభువైన యేసునందు విశ్వాస ముంచుము, అప్పుడు నీవును, నీ యింటి వారును రక్షణ పొందుదురని చెప్పి అతనికిని అతని ఇంటనున్న వారందరికిని దేవుని వాక్యము బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడు వారిని తీసుకొనివచ్చి వారి గాయములు కడిగెను; వెంటనే అతడును అతని ఇంటి వారందరును బాప్తిస్మము పొందిరి. మరియు అతడు వారిని ఇంటికి తోడుకొని వచ్చి భోజనము పెట్టి దేవునియందు విశ్వాసముంచినవాడై తన ఇంటి వారందరితో కూడ ఆనందించెను"

(అపో.కా. 16:29-34).

**8. కొరింథీయుల మార్పు :**

కొరింధు పట్టణములో పౌలు క్రీస్తును ప్రకటించెను. "కొరింధీయులలో అనేకులు విని, విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపో.కా. 18:1-8).

అపొస్తులుల కార్యములు అను పుస్తకము ప్రభువు యొక్క క్షమాపణ చట్టమును అతి విశదముగ విపులీకరించుచున్నది. అపొస్తులులు బోధించగా మార్పుజెందిన వారందరు ఒకేరీతిగా మార్పుజెందిరి. ప్రతివాని యొక్క మార్పు దేవుని వాక్యము వలన కలిగెను.

ఆ మార్పు వాక్యము బోధించుటతో ఆరంభమై బాప్తిస్మమిచ్చుటతో అంతమాయెను. వారు సువార్తవినిరి, విశ్వసించిరి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందిరి.. మరియు వారి విశ్వాసమును ఒప్పుకొనగా బాప్తిస్మము పొందిరి. ఈ విధానము ఎంత సూక్ష్మముగా యున్నదో గమనించుము. ఆధునిక విధానములకు ఎంత వ్యత్యాసముగ యున్నదో గమనించుము.

క్షమాపణ ననుగ్రహించు షరతులు మార్చబడలేనందున క్రీస్తు వైపు మార్పుజెందినవారు ఆనాడు ఏమేమి చేసిరో వాటినే పాపులు కూడ చేయవలెను.

ఒక ఉజ్జీవ కూటములో, వందల కొలది ప్రజలు మార్పు జెందుటను గూర్చి మనము వింటూ యుంటాము. అయితే నిజానికి అనేక సందర్భములలో వారిలో ఏ ఒక్కడును క్రొత్తనిబంధన షరతుల ప్రకారము మార్పుజెంది యుండలేదు. అపొస్తులులు చేసిన వాక్యబోధవైపు ప్రజలు మరలవలసి యున్నది. క్రీస్తు సువార్త రక్షణ అందరికి ఒకే రీతిగ యిచ్చుచున్నది గాని రక్షణ షరతులు మాత్రము ప్రత్యేకమైనవి. ఈ

షరతులకు లోబడిన యెడల మార్పు సంభవించును. ఒకని దేవుని బిడ్డ గాను, క్రీస్తు సంఘ సభ్యునిగాను చేయును. అపొస్తులుల కాలములో ఏది క్రైస్తవుని చేసెనో అదే ఈనాడు కూడ ఒకని క్రైస్తవుని జేయును.

అందువలన సువార్తకు లోబడుట వలన మార్పు సంభవించును. ఏలయనగా సువార్తలో ఒకడు క్రీస్తు నందు విశ్వసించ వలెననియు, పాపములన్నిటి విషయమై మారు మనస్సు పొందవలెననియు క్రీస్తు నందలి తన విశ్వాససమును ఒప్పుకొనిన తరువాత యేసుప్రభువు నామమున అతడు నీటిలో ముంచడము బొందవలెననియు ఆజ్ఞాపించబడెను. ఒకడు ప్రభువు తట్టు సంపూర్ణముగ తిరుగవలెననిన ఈ ఆజ్ఞలన్నిటికి అతడు విధేయుడు కావలెను. ఈ దైవక్రమమును జరిగించకుండ అభ్యంతర పడువాడు క్రీస్తు కొరకు నిజముగ మార్పుజెందిన వాడు కాదు.

**6. భక్తిగల ప్రజలు మార్పు జెందుట అవుసరమా?**

ఒకడు యధార్ధముగను భక్తి గల వానిగను ఉన్నయెడల అతడు దేవునిచే అంగీకరింపబడునని అనేకులు తలంచెదరు. అయితే అపొస్తులుల కార్యములలో మార్పుజెందిన వారిలో అనేకులు నిష్కపటులు, భక్తిగల వారుండిరి. ప్రభువు తట్టు తిరిగిన భక్తిగల వారిలో కొందరిని గూర్చి ఈ దిగువ చూచుకొందము :

**ఎ. పెంతెకొస్తు దినమున యూదులు**

వారు భక్తిగల యూదులు, క్రైస్తవ్యము లోనికి మొట్టమొదటిగా మారినవారు. 'ఆకాశము క్రిందనుండి వచ్చిన భక్తిగల యూదులు" (అపొ. కా. 2:5). ఆ కాలమందు జరుగు ఆరాధనకు వారు యెరూషలేములో సమకూడిరి. వారు భక్తిగలవారే అయినను వారు మార్పుజెంద వలసి వచ్చినది.

**బి. ఐతియొపీయ మనుష్యుడు :**

రక్షణ అవసరమైన మరియొక భక్తిగల పురుషుడితడు (అపొ.కా. 8:26-39). అతడు ఆఫ్రికాలో యున్న ఐతియొపీయ నుండి యెరూషలేము నకు ఆరాధనకు వచ్చి వెళ్ళుచుండెను గనుక అతడు చాల భక్తిపరుడే యని అర్ధమగుచున్నది. అతడు తన గృహమునకు తిరిగి వెళ్లుచు తన మతము యొక్క పరిశుద్ధ లేఖనములను చదువుచుండెను. ఫిలిప్పు అతని యొద్దకు రాగా యెషయా వ్రాసిన ప్రవచనముల నతడుఅర్ధము చేసి కొనుటకు సహాయకారిగ యుండు నిమిత్తము ఫిలిప్పును అతడు తన రధములోనికి ఆహ్వానించెను. ఈ మనుష్యుడు భక్తివరుడు, మత సంబంధ విషయములలో యధార్ధవర్తనుడు. అది చాల మంచి సంగతి. నిన్ను నీవు ఈ ప్రశ్న వేసికో : "నేనుసరించుచున్న భక్తి మార్గము దేవుని చిత్తమునకు భిన్నముగా యున్నదని గ్రహించిన యెడల ఈ అధికారివలె దానిని విసర్జించగలనా?"

**సి. సౌలు :**

తార్సువాడైన సౌలు చాలా భక్తి పరుడు (అపొ.కా. 23:1; 24:16; 1తిమోతి 1:12-16). భక్తిపరుడే అయినను అతడు మార్పుజెంద వలసి యున్నదని క్రొత్తనిబంధన మనకు తెలియజేయు మరియొక మాదిరి అది (అపొ.కా.9:1-12). అతడు మంచి మనస్సాక్షి గలవాడే అయినను అతడు చేయునది తప్పు. నేను సరిగా యున్నానని ఒకడు తలంచినంత మాత్రమున ఎవడును సరికాడు. అతడు మంచినే చేయ వలెనని అతని మనస్సాక్షి అతనికి తెలియ జేయవచ్చును గాని ఏది మంచిదో అది తెలియజేయదు. దేవుని వాక్యము దానిని బోధించును.

**డి. కొర్నేలీ :**

అపొస్తులుల కార్యములను పుస్తకములో కొర్నేలీని మించిన

యధార్థవర్తనుడు, భక్తిపరుడు ఇంకొకడు మనకగుపడడు. ఒకడు మంచి వాడైనంత మాత్రమున రక్షింప బడడు. ఈ నాడు నైతికముగా మంచి వారైన ప్రజలనేకులు క్రీస్తునకు వెలుపల యున్నారు. కొర్నేలీవలె వారు కూడ లేఖనముల ప్రకారము మార్పు జెందుట అవుసరము (అపొ.కా. 10:1,2).

అపొస్తులుల కార్యములను పుస్తకములో వ్రాయబడిన ఆజ్ఞలకు లోబడని భక్తిపరులందరు క్రీస్తువైపు నిజముగా మార్పుజెందిన వారు కారు. వారు క్షమించబడు నిమిత్తము పైన జెప్పబడిన మెట్టులను అనుసరింప వలెను.

**7. సంగ్రహము :**

మార్పు అనుననది సూక్ష్మమై నది, అర్థము చేసికొనదగినదే గాని అనేకులు తలంచురీతిగా విపులముగా లేని మర్మయుక్తమైనది కాదని బైబిలు బోధించుచున్నది. లేఖనముల ప్రకారము జరిగిన ప్రతి మార్పులోను మూడు ప్రత్యేక మార్పులున్నవని బైబిలు బోధించుచున్నది. ఆవేవనగా హృదయ మార్పు, చిత్తమార్పు, మారుమనస్సు వలన తన జీవితములో మార్పు, బాప్తిస్మము వలన తన సంబంధములో మార్పు ఎప్పుడు సంభవించునో అప్పుడతడు సంపూర్ణముగా మారిన వాడగును. ఇట్టి మార్పును పొందిన వారందరిని క్షమింతునని ప్రభువు వాగ్ధానము చేసెను. ఈ విధముగా మారిన వ్యక్తి ఐతియోపీయ అధికారివలె సంతోషించును. ఏలయనగా దేవుని వాగ్ధానము వలన అతని పాపములు క్షమింపబడియున్న వని నిర్ధారణ చేయబడెను. యధార్థముగా మార్పునొందిన వారందరు మరణ పర్యంతము నమ్మకముగా యున్న యెడల నిత్య రక్షణను పొందుదురు. (సమాప్తము)

–పెద్రీకోతమ్

# తబిత

## ( Tabita )

తబిత యొప్పేలోని సంఘ సభ్యురాలు. ఈ పేరు హెబ్రీ భాషలోను గ్రీకుభాషలోను దొర్కా అని కూడ పిలువబడును. ఈమె చేసిన సత్కార్యములు, ధర్మకార్యములు పరిశుద్ధ గ్రంధములో బహుగా పొగడబడినవి. ఈమె యొక్క శరీరాకృతిని గూర్చి యెక్కువ తెలియదు గాని, ఆమె పరిశుద్ధత యను అలంకారమును కలిగి యుండెను. తబిత వ్యాధిగ్రస్థురాలై చనిపోయెను. యొప్పేలోని క్రైస్తవులు అపొస్తలుడైన పేతురు లుద్దలో యున్నాడని తెలిసికొని యొప్పేకు రమ్మని కబురు చేసిరి (అపొ.కా. 9:36-42). తబిత యింటి దగ్గర విధవరాంన్డ్రందరును చేరి యేడ్చుచు ఆమె తమతో యున్నపుడు కుట్టిన అంగీలును, వస్త్రములను చూపుచు పేతురు యెదుట నిలిచిరి. పేతురు అందరిని వెలుపలకు పంపి, మోకాళ్లూని ప్రార్థన చేసి శవము వైపు తిరిగి తబితా లెమ్మనగానే ఆమె కన్నులు తెరచి పేతురును చూసి లేచి కూర్చుండెను. పేతురు విధవరాండ్రను, పరిశుద్ధులను పిలచి ఆమెను సజీవురాలినిగా వారికి అప్పగించెను.

### సత్ క్రియలు

మంచి పనులు అనగా మనము ఇతరుల కొరకు చేయు సహాయము. కైసరయలోని కొర్నేలి దేవుని యందు భయభక్తులు కలిగియుండి ప్రజలకు చేయు ధర్మకార్యములన్నియు దేవుని సన్నిధిలోనికి వెళ్లినట్లు వైద్యుడైన లూకా వ్రాసెను (అపొ.కా. 10:1-4). మన పరలోక తండ్రియైన యెహోవా అందరికి ఉపకారి (కీర్తనలు 145:9). ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను వర్షము కురిపించుచున్నారు (మత్తయి 5:45). కయీను తన తమ్ముడైన హేబెలును చంపినపుడు నీవు సత్క్రియ చేసిన యెడల తల నెత్తుకొనవా? సత్క్రియ చేయనియెడల వాకిట పాపము పొంచియుండును. నీ యెడల దానికి వాంఛకలుగును నీవు దానిని ఏలుదువని దేవుడైన యెహోవా చెప్పెను (ఆది.కా. 4:7). సత్క్రియలు

చేయవలెనని మొదటి నుండియు మనకు దేవుడు చెప్పుచున్నారు. దేవుడా యనకు తోడైయుండెను గనుక ఆయన మేలు చేయుచు, అపవాది చేత పీడింప బడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను (అపో.కా.10:38). తీర్పు దినమందు మంచి కార్యములు చేసిన వారిని చూచి, నాతండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని యేసు చెప్పును. మంచి కార్యములు చేయని వారితో శపింపబడినవారలారా : నన్ను విడచి అపవాదికిని, వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి అని చెప్పును (మత్తయి 25:31-46).

## విలువగల పరిచర్య

సత్క్రియ చేయు ప్రతి వానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ మహిమయు, ఘనతయు, సమాధానము కలుగునని ప్రతి క్రైస్తవ సంఘమును అపొస్తులుడైన పౌలు హెచ్చరించుచున్నాడు (రోమా 2:10; 12:7-21, 15:2). తబిత తన యొక్క మంచి కార్యములు ద్వారా మహిమ, ఘనత, సమాధానములను పొందెను. ఎవడును తనకొరకే కాదు, ఎదుటి వానికి మేలు చేయచూచుకొనవలెను (1కొరింథి 10:23). యొప్పేలోని క్రైస్తవులకు తబిత ఈ విధమైన పరిచర్య చేసినది, అన్నిటియందు యెల్లప్పుడు మీలో మీరు సర్వసమృద్ధి గలవా ఉత్తమమైన ప్రతికార్యము చేయుట దేవుడు మీ యెడల సమస్త విధములై కృపను విస్తరింపచేయగలడు (2కొరింథ 9:8,9; కీర్తనలు 12:9). అపోస్తలుడైన పౌలు గలతీ సంఘమునకిట్లు వ్రాయు చున్నాడు "మనకు సమయము దొరికిన కొలది అందరియెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వా యెడలను మేలు చేయుదము" (గ 6:10). తబిత యొప్పేలోని విశ్వా గృహమునకు చెందిన విధవరాండ్రక ఈ విధమైన మంచి కార్యములు చేయు చుండెను. మనము వాటి యందు నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింప బడినవారమై ఆయన చేసిన పనియై

యున్నాము (ఎఫెసీ 2:10). మనము చేయు మంచి కార్యములు మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతికరమును, ఇష్టమైన యాగమునైయున్నవి (ఫిలిప్పీ 4:9). మేము మీనిమిత్తము ప్రార్థన చేయుట మానక, మీరు సంపూర్ణ జ్ఞానమును, ఆత్మసంబంధమైన వివేకము గలవారునై., ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమై జ్ఞానమునందు అభివృద్ధి చెందుచు, అన్ని విషయములలో ప్రభువును సంతోష పెట్టునట్లుగా నడచుకొనవలెననియు, ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును, దీర్ఘశాంతమును కనుబరచునట్లు ఆయన మహిమ శక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు, పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగునట్లు మనలను పాత్రులనుగా చేసెను (కొలస్స 1:10-12). మంచి పనులు చేయుటకు యెన్నడును విసుకవద్దు. మీరు ఒకని యెడల ఒకడును, మనుష్యులందరి యెడలను యెల్లప్పుడును మేలైన దానిని అనుసరించి నడుచుకొనుడి (1థెస్స :15). మేలు చేయుటలో విసుకవద్దు (2థెస్స 3:13). తబిత తన మంచి కార్యముల ద్వారా తన్నుతాను అలంకరించుకొనునది (1తిమోతి 2:10;6:18). దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కారమునకు పూర్ణముగ సిద్ధపడియుండునట్లు, దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమోతి 3:17). మేలు చేయువాడు దేవుని సంబంధి. కీడుచేయువాడు దేవునిని చూచినవాడు కాడు (3 యోహాను : 11).

### ప్రాముఖ్యత

క్రొత్త నిబంధన గ్రంథములో మంచి పనుల యొక్క ప్రాముఖ్యతను గూర్చి వాటి విలువను గూర్చి మనము చదువుదుము. మంచి కార్యములు ఆత్మీయ ఫలములలో ఒకటిగను దేవునికిష్టమైన సువాసనగల యాగముగను, ఒక అభరణముగను దేవుని మహిమార్ధమై యుండి మనకు పరలోకములో ధనముగయుండును. తబిత పరలోకమందు యెక్కువ ధనమును సమకూర్చు కొనినది (మత్తయి

6:19,20). పేదలను కనికరించుట ద్వారా తబిత దేవునికి అప్పుయిచ్చినది (సామెతలు 19:17).

యదార్థహృదయులు అవసరతలలో యున్నవారికి సహాయము చేయుదురు. అట్టివారు కరుణా కటాక్షములను కిరీటముగ ధరింతురు (కీర్తన 63:3). ఆయనను వెంబడించు వారి యెడల ఆయన ఎంతో కనికరము గలవాడు. క్రైస్తవులమైన మనము మన పరలోకపు తండ్రి యొక్క ప్రేమ, దయలను రుచిచూచి యున్నాము (1పేతురు 2:3). ఆయన ప్రేమ, కనికరము గల దేవుడైనందున అనేకులను స్వస్థపరచుచుండెను (మత్తయి 9:36). వారికి బోధించు చుండెను (మత్తయి 20:34). ఆహారము పెట్టుచుండెను (మార్కు 1:41; లూకా 9:12). ఆయన నాయీను విధవరాలి యెడల ఎంతోకనికరము గలవాడై ఆమె కుమారుని బ్రతికించెను. (లూకా 7:11-18). యెరూషలేము నుండి యెరికోపోవుచున్న వ్యక్తి దొంగల చేతిలో చిక్కిగాయపరచబడి నపుడు సమరయుడు అతనిని ఎక్కిరించుకొని అతని విషయమై జాగ్రత్త వహించెను (లూకా 10:30-37). కనికరములేనిచే కష్టములలో యున్నవారికి, అవసరతలలో, ఆపదలలో యున్న వారికి మనము సహాయము చేయలేము. మీ తండ్రి కనికరము గలవాడైయున్నట్లు, మీరును కనికరము గలవారై యుండుడి (లూకా 6:36).

తబిత మంచి కార్యములు ద్వారా మహిమను, ఘనతను, అక్షయతను నిత్యజీవమును సంపాదించుకొనినది (రోమా 2:7). దీనికి ఆశ్చర్యపడకుడి, సమాధులలో యున్నవారందరు ఆయన శబ్ధము వినిమేలు చేసినవారు జీవపునరుద్ధానమునకు, కీడు చేసినవారు తీర్పు పునరుద్ధానమునకును బయటకు వచ్చెదరు (యోహాను 5:28,29).

మనము మరణము చెందినపుడు మనలను గూర్చి ప్రజలు యేమి చెప్పుదురు? ఈలోకమును మనము విడిచి పెట్టునపుడు మనవెంట యెటువంటి క్రియలు వచ్చును? (ప్రకటన 14:13). తబిత యొక్క జీవితముతో మన జీవితములను సరిపోల్చుకొనిన మన స్థానమెచ్చట యుండును?

– కబితా గూటం

# సంక్షిప్త వార్తలు

2018 జూలై మొదటి వారములో అమెరికాలోని ఓక్లహోమా స్టేట్ యూనివర్శిటీ నుండి 9 మంది యువతీయువకులు భారతదేశ పర్యటన నిమిత్తము కాకినాడకు విచ్చేసిరి. వారు రిక్కీగూటం గారు నడుపుచున్న చిల్డ్రన్ హోమ్‌లో బసచేయుచు అందున్న పిల్లలతో పాటలు పాడుచు, వారికి నేర్పుచు అనేక సంగతులు వారికి నేర్పించిరి. మరియు వారిని రిక్కీగూటం గారు పలు పట్టణములకు పల్లెలకు తీసికొని వెళ్లి భారతదేశ పట్టణ పల్లెటూరి వాతావరణమును, జీవనవిధానమును తెలియజేసిరి. ఆ విద్యార్థులు కూడ పల్లెటూళ్లలో ఉల్లాసముగా గడుపుచు అక్కడున్న ప్రజలతో స్నేహ సంబంధాలు నెలకొల్పుకొనిరి. వచ్చిన వారందరు జూలై ఆఖరు వారానికి తమ స్వదేశమునకు చేరుకొనిరి.

2018 జూలై 20వ తేదీన ఓక్లహోమా నుండి మరియొక బృందము కాకినాడ చేరుకొనిరి. వారికి లేనీజోన్ గారు నాయకత్వము వహించిరి. వారు కూడ పలుప్రాంతములు పర్యటించి దేవుని ప్రేమను ప్రజలకు తెలియజెప్పిరి.

2018 జూలై 23వ తేదీ సోమవారము నాడు సత్యవాణి-క్రీస్తుసంఘ ఆవరణములో సువార్తికుల సదస్సు జరిగెను. ఆంధ్రా తెలంగాణ ప్రాంతముల నుండి అనేకమంది సువార్తికులు వారి సతీమణులతో సహా హాజరై దేవుని వాక్యబోధనలో పాల్గొనిరి. లేనీజోబ్ గారు, గేరీజాన్సన్ గారు తదితరులు వాక్య పరిచర్యచేసిరి. కూటమునంతటినీ రిక్కీ గారు సమర్థవంతముగా నడిపించిరి. సోదరులు టి. జ్ఞానసుధీర్ గారు, రిక్కీగారు విదేశీ సోదరుల ప్రసంగములను తెలుగునకనవదించిరి. హాజరైన వారందరికీ మంచి రుచి, శుచిగల భోజన పానాదులు ఏర్పాటు చేయబడెను. కాకినాడ సత్యవాణి ఆవరణలో ఒకేసారి 23 మంది విదేశీసోదరసోదరీలు కలసి పనిచేసిరి. ఈ భారభరితమైన పనిని రిక్కీగూటం గారు సమర్థవంతముగా నడిపించిరి. రాబిన్ గూటం గారు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ చక్కటి నాయకత్వమును ప్రదర్శించిరి. అందరు ఆయనను అభినందించిరి.

2018 జూలై మాసమంతటిలో జరిగిన స్త్రీల కూటములో విదేశీ వనితలు పాల్గొనిరి. మరియు కొంతమట్టుకు వాక్యపరిచర్య చేసిరి. సోదరి సుదీపగూటం గారు, రేచెల్ గూటం గారును తెలుగునకనువదించుటలో సహకరించిరి.

2018 జూలై 28 శనివారం ఉదయానికి జాషువా, కవితా గూటం దంపతులు అమెరికా నుండి కాకినాడకు క్షేమముగా చేరుకొనిరి. అమెరికాలో శస్త్రచికిత్స జరిగిన ఏడువారముల అనంతరము సోదరి కవితా గూటం గారు స్వదేశమునకు చేరుకొనిరి. స్థానిక సంఘము, బంధుమిత్రలు వారికి ఘనస్వాగతము పలికిరి.

సతవాక్కు మాసపత్రిక గతనెలలో (ఆగస్టులో) 40వ సంవత్సరములో ప్రవేశించినది. ఇంచుమించు 12 వేల గృహములను ప్రతినెలా అది దర్శించుచున్నది. గత 40 సంత్సరములలోను, ఏ ఒక్క సంచిక కూడ ఆగకుండా ప్రతి నెలా సకాలమునకు తయారుచేయబడి అనేక ఆత్మీయ విషయములను ప్రజలకు నేర్పుతూ ముందుకు పోవుచున్నది. ఈ పరిచర్య విషయమై ప్రార్థించమనవి.

మీ స్థానిక సంఘములలో బైబిలుకోర్సు చేయని విద్యార్థినీ విద్యార్థులుంటే వారిని బేసిక్ బైబిల్ కోర్సులో చేర్పించండి. అది పూర్తిచేయగానే ఒక బైబిలు వారికి అందజేయబడును.

RNI Regd. No. 69973/98
Postal Regd.No. AP/KD-02/2018-20

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.